ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సీహెచ్ ప్రసాద్

హయత్‌నగర్, నవంబర్ 5: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సీహెచ్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. గత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సోమవారం బడంగ్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు.

ఓటీఎస్‌తో రూ.85 లక్షలు వసూలు

మలక్‌పేట జలమండలి డివిజన్ డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ

మలక్‌పేట, నవంబర్ 5: ఓటీఎస్ ద్వారా పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ప్రజలనుంచి విశేష స్పందన లభిస్తుందని.. గత నెల 15 నుంచి ఈనెల 5 వరకు ఓటీఎస్ ద్వారా మలక్‌పేట జలమండలి డివిజన్‌లో రూ.85లక్షలు వసూలు చేసినట్లు మలక్‌పేట జలమండలి డివిజన్ డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ తెలిపారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఓటీఎస్ ద్వారా పెండింగ్ నల్లా బిల్లులు చెల్లించి నల్లాలు డిస్‌కనెక్షన్ కాకుండా చూసుకోవాలని వినియోగదారులకు సూచించారు. మలక్‌పేట డివిజన్ పరిధిలో సుమారు 1600 మంది వినియోగదారులు ఉన్నారని, ఇప్పటివరకు ఓటీఎస్ ద్వారా 790 మంది వినియోగదారులు లబ్ధిపొందారని తెలిపారు. ఈనెల 30లోపు ఓటీఎస్ ద్వారా పెండింగ్ నల్లా బిల్లులు చెల్లించి నల్లా కనెక్షన్లు డిస్‌కనెక్షన్ కాకుండా చూసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న స్కూల్ గేమ్స్ ఫెండరేషన్ ప్రతినిధులు

ఆర్కేపురం, నవంబర్ 5: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికలకు 68వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి 50 మంది పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. కాసుల భార్గవ్‌రామ్ రెండు బంగారు, ఒక వెండి పతకాలతో చాంపియన్‌షిప్ ట్రోఫీని దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బిక్యానాయక్, స్విమ్మింగ్ కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కందుకూరు, నవంబర్ 5: బాల్య వివాహాలు చేయడం నేరమని కందుకూరు సీఐ సీతారామ్ తెలిపారు. కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా పులిమామిడి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై సైదులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే చేయనున్న సిబ్బందికి వివరాలతో కూడిన బ్యాగ్‌ను అందజేస్తున్న హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య

సరూర్‌నగర్ సర్కిల్‌లో సమగ్ర సర్వే ఎన్యూమరేటర్లకు వివరాలతో కూడిన బ్యాగ్‌ను అందజేస్తున్న ఉప కమిషనర్ సుజాత

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

ఎల్బీనగర్, నవంబర్ 5: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం చేశారు. హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య నేతృత్వంలో హయత్‌నగర్ సర్కిల్ అధికారులు నాలుగు డివిజన్లలోని ఇంటింటి సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు సర్వేకు హయత్‌నగర్ సర్కిల్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. సమగ్ర సర్వే నవంబర్ 6వ తేదీతో మొదలై నవంబర్ 20వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని 97,456 నివాసాలు 2,92,369 మంది జనాభాకు గాను సమగ్ర సర్వే నిర్వహించేందుకు 649 మంది ఎన్యూమరేటర్లను నియమించడం జరిగిందని, వీరికి అదనంగా మరో 33 మంది సిబ్బందిని కూడా నియమించామన్నారు. సమగ్ర సర్వేను 65 మంది అధికారులు సూపవైజింగ్ చేస్తారని తెలిపారు. నాగోలు డివిజన్‌లో 22,855 నివాసాలకు 152 మంది ఎన్యూమరేటర్లు, మన్సూరాబాద్ డివిజన్‌లో 23,411 నివాసాలకు 156 మంది, హయత్‌నగర్ డివిజన్‌లో 23,669 నివాసాలకు 158 మంది, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో 27,521 నివాసాలకు 183 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొననున్నారు. ఈ సర్వేలో జీహెచ్ఎంసీ, ప్రభుత్వ టీచర్లు, అంగన్‌వాడీ సహాయకులు, ఆశావర్కర్లు, రీసోర్స్ పర్సన్స్, క్వాలీఫైడ్ టీచర్లు పాల్గొంటున్నారని, వారికి ఇప్పటికే నాలుగు దఫాల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు.

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో..

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో సమగ్ర సర్వే కోసం అన్ని సిద్ధం చేసి బుధవారం నుంచి రంగంలోకి దిగనున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత నేతృత్వంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఐదు డివిజన్ల పరిధిలో సమగ్ర సర్వేను నిర్వహించేందుకు రెడీ అయ్యారు. సరూర్‌నగర్ సర్కిల్‌లోని ఐదు డివిజన్లలో మొత్తం 1,00,200 నివాసాల్లో 3,00,600 జనాభా ఉండగా వారిని 668 మంది ఎన్యూమరేటర్లు 67 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే చేయనున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని సరూర్‌నగర్ డివిజన్‌లో 19,650 నివాసాల్లో 58,950 జనాభాను 131 మంది ఎన్యూమరేటర్లు, 13 మంది సూపర్‌వైజర్లు, ఆర్కేపురం డివిజన్‌లో 16,500 నివాసాలు, 49,500 జనాభాను 110 మంది ఎన్యూమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లు, కొత్తపేట డివిజన్‌లో 22,050 నివాసాలు 66,150 జనాభాకు గాను 147 మంది ఎన్యూమరేటర్లు, 15 మంది సూపర్‌వైజర్లు, చైతన్యపురి డివిజన్‌లో 20,550 నివాసాలు, 61,650 జనాభాను 137 మంది ఎన్యూమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లు, గడ్డిఅన్నారం డివిజన్‌లో 21,450 నివాసాలు, 64,350 జనాభాను 143 మంది ఎన్యూమరేటర్లు 14 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సగ్రమ సర్వేను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఉప కమిషనర్ సుజాత తెలిపారు.

ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో..

ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోనూ సమగ్రసర్వే ఆరంభం కానున్నది. ఉప కమిషనర్ సేవ్లా నేతావత్ నేతృత్వంలో నాలుగు డివిజన్ల పరిధిలో బుధవారం నుంచి సర్వే చేసేందుకు సిద్ధం అయ్యారు. ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 1,01,536 నివాసాల్లో 717 మంది ఎన్యూమరేటర్లతో సమగ్ర సర్వేను నిర్వహించనున్నారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయండి

- రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- హయత్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ ఎదుట ఆందోళన

హయత్‌నగర్, నవంబర్ 5 : స్కూల్ గేటు మీద పడి మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హయత్‌నగర్ జెడ్పీహెచ్ స్కూల్ ఎదుట మృతుని కుటుంబసభ్యులు, బంధువులు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్కూల్ హెడ్మాస్టర్, ఎంఈఓ, డీఈఓ నిర్లక్ష్యం కారణంగానే స్కూల్ గేటు పడి ఒకటో తరగతి చదువుతున్న అజయ్(6) మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్‌రూం ఇల్లుతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, నాయకులు గంగని శ్రీను, పారంద మహేశ్, శంకర్ నాయక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ ఎదుట మృతుని తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ సాయం : డీఈఓ

విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, హయత్‌నగర్ మండల తహసీల్దార్ జానకి, ఎంఈఓ కె.శ్రీనివాసులులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మృతిచెందిన విద్యార్థి అజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి ప్రభుత్వ సాయంగా రూ.4లక్షలు ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్ రూం ఇల్లు, ఇదే స్కూల్‌లో కాంట్రాక్టు పద్ధతి కింద విద్యార్థి తల్లికి స్వాంవెంజర్ ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట సాహెబ్‌నగర్ హెడ్మాస్టర్ దినేశ్, సిబ్బంది ఉన్నారు.

శివారు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి

మన్సూరాబాద్, నవంబర్ 5: శివారు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తిస్తాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఎల్లారెడ్డికాలనీ, పవనగిరికాలనీ ఫేజ్-2, ఎల్లారెడ్డికాలనీ ఫేజ్-2లో మంగళవారం పర్యటించి సదరు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డికాలనీ నుంచి పవనగిరి, ఎల్లారెడ్డికాలనీ ఫేజ్-2 పరిసర ప్రాంతాల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న యూజీడీ, సీసీరోడ్ల పనులను పూర్తి చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు కళ్లెం రవీందర్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్, రాజేందర్, మాధవరెడ్డి, యాసిన్, ప్రశాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మలక్‌పేట, నవంబర్ 5: మూసారాంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని బాలాజీ మిఠాయి బండార్ వద్ద రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని కాలనీల్లో రహదారుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి టి.రమేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, కొప్పుల దినేశ్ పటేల్, గణేశ్, వరప్రసాద్, పరశురామ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలి

హయత్‌నగర్, నవంబర్ 5: హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీకి సమీపంలోని హిందూ శ్మశాన వాటిక చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను హార్టికల్చర్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్మశాన వాటిక చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా చెట్లతోపాటు గ్రీనరీ ఏర్పాటు చేయాలని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ, సర్కిల్ ఇన్‌చార్జి మేధా, సిబ్బంది అర్జున్, నాయకులు గంగని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కందుకూరు, నవంబర్ 5: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతాప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అష్రఫ్ బేగ్‌తో కలిసి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కోసం నిరంతరం పని చేస్తున్నట్లు వివరించారు. రుణమాఫీతో పాటు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం సంతోషమని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సాధ పాండురంగారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, అజీజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చైతన్యనగర్ కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలి

వనస్థలిపురం, నవంబర్ 5: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని చైతన్యనగర్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు నిర్వహించాలన్నారు. బీటీ రోడ్డు పనులు పూర్తయితే కాలనీవాసులులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పనుల్లో నాణ్యతా లోపాలు ఉంటే సహించేది లేదన్నారు. కాలనీవాసులు పనులను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌రావు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు

కందుకూరు, అక్టోబర్ 5: బాచుపల్లి, నేదునూరు రోడ్డును బాచుపల్లి యువజన సంఘం సభ్యులు మరమ్మతులు చేయించారు. రోడ్డంతా గుంతలతో అధ్వానంగా మారడంతో వాహనదారులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పట్టించుకోకపోవడంతో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ముందుకు వచ్చి సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టి పోసి చదును చేశారు. కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, కృష్ణాగుప్తా, అంజయ్య, సంఘం అధ్యక్షులు కృష్ణ, శ్రీశైలం, వెంకటేశ్, నర్సింహా, విజయ్, రాజశేఖర్, శ్రీశైలం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో పనులు అడ్డుకున్న స్థానికులు

సైదాబాద్, నబంబర్ 5: సైదాబాద్ డోబీ ఘాట్ హిందూ శ్మశానవాటిక పక్కన ఉన్న బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద వివాదస్పద స్థలంలో కొనసాగుతున్న పనులను స్థానికులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం సైదాబాద్ పూసల బస్తీవాసులు, స్థానికులు అడ్డుకొని పనులను చేస్తున్న వారితో వాగ్వివాదానికి దిగి ఆందోళనకు దిగారు. గత కొంతకాలంలో వివాదంలో కొనసాగుతున్న స్థలంలోకి ఒక వ్యక్తి వచ్చి తన దంటూ జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో కూలీలతో పనులను చేపట్టాడు. వివాదంలో కొనసాగుతున్న భూమిని ఎలా చదును చేస్తారంటూ స్థానికులు ఆందోళన చేపట్టి పనులను నిలిపివేయించారు. ఈ స్థలం తనదంటూ వచ్చిన వ్యక్తితోపాటు అతనికి మద్దతుగా వచ్చిన వారితో స్థానికులు వాగ్వివాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. స్థానికంగా ఉద్రికత్త నెలకొనటంతో సైదాబాద్ పోలీసులు జోక్యం చేసుకొని పనులను నిలిపివేయించారు. ఈ స్థల వివాదానికి సంబంధించిన వివరాలను సైదాబాద్ పోలీసులు స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. ఎర్రకుంట హిందూ శ్మశానవాటికకు సంబంధించిన స్థలంగా తాము భావిస్తున్నామని, గతంలో చాలమంది అనేక మార్లు కబ్జాకు విఫల ప్రయత్నాలు చేశారని తెలిపారు. సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు స్థల వివాదంపై జోక్యం చేసుకొని, శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గూడ్స్ వెహికిల్ అదుపుతప్పి.. డ్రైవర్ మృతి

మన్సూరాబాద్, నవంబర్ 5: గూడ్స్ వెహికిల్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన నందకిశోర్ రాయ్ (31) మూడేండ్లుగా హయత్‌నగర్, పసుమాముల గ్రామంలో ఉంటూ పాల వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గూడ్స్ వెహికిల్‌లో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో పాల ప్యాకెట్లను తీసుకుని నాగోల్, శుభం కన్వెన్షన్ సమీపంలోని వెంకట్‌రెడ్డినగర్ కాలనీకి వెళ్లాడు. రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపాడు. వాహనం ముందుకు వెళ్లకుండా ఉండేందుకు టైర్ల కింద రాయి పెట్టేందుకు ప్రయత్నించగా.. వాహనం ముందుకు కదిలింది. గూడ్స్ వెహికిల్‌ను ఆపే క్రమంలో దాని వెనుక నందకిశోర్ రాయ్ పరిగెత్తాడు. కొంత దూరంలో ఉన్న షట్టర్‌ను ఢీకొట్టిన గూడ్స్ వాహనం బోల్తా పడగా.. ప్రమాద వశాత్తు ఆ వాహనం నంద కిశోర్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేసిన బోస్కో సేవా సంస్థ

ఎల్బీనగర్, నవంబర్ 5: కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీనగర్ బస్తీలోని వివిధ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాయంత్రం సమయాల్లో ఉచితంగా ట్యూషన్ చెప్పే సౌకర్యాన్ని బోస్కో స్వచ్ఛంద సంస్థ వారు కల్పించారు. పాఠశాలలకు వెళ్లి వచ్చిన అనంతరం సాయంత్రం సమయంలో స్థానిక రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో స్థానికంగా ఉండే ఓ టీచర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెబుతున్నారు. ఈ క్రమంలో ఉచితంగా ట్యూషన్‌కు హాజరవుతున్న విద్యార్థులకు బోస్కో సేవా సంస్థ వారు ఉచితంగా పలకలు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. స్థానిక బస్తీ పెద్దలు మల్లెపాక యాదగిరి, రమావత్ దీప్‌లాల్, చాంద్ పాషా, జోగు నాగేశ్, పల్లె అజయ్‌కుమార్, ఎండీ జానీబాబా, బి.ఉషా, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేసిన ఆర్ఎం వరప్రసాద్, చిత్రంలో డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాసరావు

కష్టపడి పనిచేస్తే సంస్థకు ఫలితాలు

హయత్‌నగర్, నవంబర్ 5: ఆర్టీసీ సంస్థలో కష్టపడి పనిచేస్తే వాటి ద్వారా వచ్చే ఫలితాలు ఆనందాన్నిస్తాయని హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డిపో-1లో డిపో మేనేజర్ విజయ్ అధ్యక్షతన జరిగిన ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవానికి ఆర్ఎం వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఎండీ ప్రవేశపెడుతున్న ఎన్నో కొత్త పథకాలను ప్రయాణికులకు చేరవేయడంలో సిబ్బంది ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. సంస్థ ఉద్యోగుల క్షేమంతోపాటు వారి జీవిత భాగస్వాముల క్షేమం కొరకు ప్రతిఒక్క డిపోలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ రీజియన్‌లో హయత్‌నగర్-1 డిపో మొదటి స్థానంలో ఉందని అభినందించారు. శ్రీనివాస్, సత్తయ్యతోపాటు ఉత్తమ ఉద్యోగులుగా ఎన్నికైన 34 మందికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో-2 మేనేజర్ శ్రీనివాసరావు, సహాయ మేనేజర్లు విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక

విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు

హయత్‌నగర్, నవంబర్ 5: విప్రో సంస్థకు చెందిన సంతూర్ స్కాలర్‌షిప్‌నకు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం ఫస్టియర్ విద్యార్థిని ఆత్మకూరి అక్షయ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్రో కన్యూజ్‌మర్ కేర్ విభాగం గర్ల్స్ స్కాలర్‌షిప్ 2024-25, సంతూర్ స్కాలర్‌షిప్ పథకం 2024-25 పథకం కింద అక్షయ డిగ్రీ మూడేళ్లకు ప్రతి ఏడాదికి రూ.24 వేలు చెల్లించనున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని అక్షయను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహ, వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శారదాదేవి, బాల నాయక్, కళాశాల గ్రంథ పాలకుడు డాక్టర్ దుర్గాప్రసాద్, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కందుకూరు, నవంబర్ 5: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని నేదునూరు ప్రభుత్వ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ కోరారు. ఐఐసిటీ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు డాక్టర్ వత్సల రాణి, ఆంటోనిలో 16మందితో కూడిన 16మంది బృందం పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యార్థులకు పరిశోధన పట్ల అవగాహన కల్పించారు. నానో రోబోటిక్స్, ఔషధాల తయారీ, హైపర్ సిస్టమ్, ఇంటలీజెన్స్, పర్యావరణ పరిరక్షణ, పరిశోధనలు, దేశంలో ఉన్న విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో అరుణ, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో రజత పథకం సాధించిన విద్యార్థులు

బడంగ్‌పేట, నవంబర్ 5: తెలంగాణ జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో రజత పథకం సాధించిన బీపీడీఏవీ విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు జరిగాయి. అందులో రంగారెడ్డి జిల్లా రజత పతకాన్ని గెలిచింది. మొదటి స్థానం అదిలాబాద్, రెండో స్థానంలో మహబూబ్‌నగర్‌లో దిక్కించుకుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ తిరుమల్ రెడ్డి, బీపీడీఏవీ కంచన్‌బాగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వీఎస్ ప్రశాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

లక్ష్మీదేవి (ఫైల్)

మన్సూరాబాద్, నవంబర్ 5: ఉద్యోగ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, సాయినగర్ గుడిసెల్లో రంగస్వామి, సునీత దంపతులు తమ కుటుంసభ్యులతో కలిసి నివాసముంటున్నారు. వీరి పెద్ద కూతురు లక్ష్మీదేవి (23) ఉప్పల్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో సేల్స్ గర్ల్‌గా పని చేస్తుంది. ఈనెల 4న ఉదయం ఉద్యోగ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సదరు యువతి ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం పని చేసే సంస్థతో పాటు మిత్రులు, బంధువుల ఇండ్లలో వెతికినా జాడ తెలియరాలేదు. తన కూతురు అదృశ్యం వెనుక ఉన్న వేణుగోపాల్ అనే యువకుడి ప్రమేయం ఉండవచ్చునని లక్ష్మీదేవి తల్ల